# వెన్నెలజల్లు

అవధానుల విజయలక్ష్మి

పైన ఆకాశంలో చవితి చంద్రుడు...

కింద ఆరుబయట తుంగచాపమీద చంద్రి...

ఇద్దర్నీ మార్చిమార్చి చూస్తున్నాడు రంగడు.

"ఏటి మావా అట్టా ఆకాశమెంక చూత్తావు?" ఓరగా చూస్తూ అడిగింది చంద్రి.

"ఆకాశెంలో ఆ పెందమామ వొంపు అందంగుందా, నీ నడుం వొంపు అందంగుండాదా అవి" చిలిపిగా చూస్తూ అన్నాడు రంగడు.

ఆకాశంలో చుక్కలతో పోటీ పడుతున్నట్లు ఫక్కున నవ్వుతూ నడుం ఒంపు మరింత ఎక్కువగా కనిపించేట్లు తుంగచాపమీద పక్కకు వొత్తిగిల్లి చెంపకు చెయ్యానిచ్చి యింతింత కళ్ళు చేసుకొని చూస్తూ అంది చంద్రి.

"అయితే మావా.... రాత్రెల్లా అట్టా ఆకాసంలోని పెందమావని చూత్తా కూసుంటావా?"

"చూత్తా కూసుంటే నీ కేటయిందేహే?"

"ఏటయిందా... తెల్లార్లూ అట్టా పైనున్న పెందమామని సూత్తా కిందున్న పెంద్రిని మర్చిపో,... తెల్లారి కోడి కూసిందంటే తెల్ల మొకం ఏత్తావు మల్లా" ఓరగా చూస్తూ అంది చంద్రి.

"ఓయమ్మా... ఓపలేకపోతుండానని చెప్పరాదటే! ఈ డొంకతిరుగుడెందుకూ?" కాస్తంత వొంగొని చంద్రి నడుం వొంపు తిరిగినచోట చెయ్యివేస్తూ అన్నాడు రంగడు.

అంతవరకు చిలిపిగా చూస్తూ నవ్వే

తున్న చంద్రి చప్పున నవ్వునాపేసి కళ్ళు కిందికి వాల్చేసింది. నడుం ఒంపు దగ్గర మొదలైన పులకింత ఒళ్ళంతా జరజరా పాకింది. ఆ పులకింతల చిరుజల్లులో తడిసి ముద్దయిపోతూ పావురాయి పిట్టలా కువకువలాడింది చంద్రి.

రంగడి చేతిమీద చెయ్యేసి తోసేస్తున్నట్లు నటిస్తూ మత్తుగా అంది "ఛో మావా మువ్వ మరీనూ!" పులకింతల చిరుజల్లు చంద్రి చేతులగుండా రంగడి చేతుల్లోకి పాకి సన్నగా వణికాయా చేతులు.

రంగడి చేతుల ఒణుకు పులకింతల చిరుజల్లుని జడివానకింద మార్చేసింది. ఆ జడివానలో ఉక్కిరిబిక్కిరయిపోతూ చప్పున రంగడి గుండెల్లో మొహం దాచేసుకొంది చంద్రి.

ఆకాశమంతున్న అంత భారీ పువ్వు లాంటి చంద్రిమొహం తగలగానే ఎగ సెగసి పడింది.

అతని చేతులు ఆమె నడుం దగ్గర్నుంచి నెమ్మదిగా వీపు వెనకభాగానికి పాకాయి. అరమోడ్పులయిన రంగి కళ్ళు పరవశంతో మూసుకొన్నాయి.

* * *

బోర్లా పడుకొని మంచం పట్టెమీద ఆ వారం పత్రికని పెట్టుకొని చదువుతున్న మంజుల చేతుల బరువుని గుండె లాగేసుకోగా...బలహీనమైన ఆ చేతులు యింక ఆ పుస్తకాన్ని పట్టుకోలేకపోగా టప్పున మంచంమీంచి జారి కిందపడిందా పుస్తకం.

తెరిచివున్న పుస్తకంలోంచి చంద్రీ, రంగడూ యిద్దరి బొమ్మలూ కనిపిస్తున్నాయి. కిందపడిన ఆ పుస్తకాన్ని మళ్లా తీసి చదివే ఓపికలేక ఆ బొమ్మపైపే అలా చూస్తూ బోర్లా పడుకొని వుండి పోయింది మంజుల.

గుండెలను మెత్తగా హత్తుకొంటోంది పరుపు. అంత తియ్యని బాధని మరి భరించలేక బోర్లా పడుకొన్నది కాస్త పక్కకు తిరిగి పడుకొని కళ్ళు మూసుకొంది. మూసుకొన్న కళ్ళ వెనక అవే దృశ్యాలు- చంద్రీ, రంగడూ...ఊహూ కాదు తనూ, మనోహర్-

పొద్దున్నటించి ఎన్నిసార్లు ఆ కథ చదివిందో! చదువుతున్నకొద్దీ తియ్యని బాధ గుండెని కోతకోస్తూనే వుంది

పొద్దున్న పది గంటల్నించి అదే ప్రశ్న.

'ఏం జరుగుతుంది?- సాయంత్రం ఏం జరుగుతుంది? అని.

"ప్రశ్న మనసులోకి వచ్చినప్పుడల్లా దాని వెంటే తరుముకొంటూ కథలోని ఆ దృశ్యాలూ మనస్సులోకి పరిగెత్తుకొని వచ్చేస్తున్నాయి.

మనస్సులో తిష్టవేసు కూర్చొన్న ఆ దృశ్యాలు ఆ తియ్యనిబాధని మరింత ఎక్కువ చేస్తూనే వున్నాయి.

సరిగ్గా వారంరోజులక్రితమే పెళ్ళి



నిశ్చయమైంది తనకీ, మనోహర్ కి

పెళ్ళిచూపుల్లో మాట్లాడుకొన్న ఒకటి రెండు మాటలు తప్ప తర్వాత ఒకరి నొకరు చూసుకోనుకూడా లేదు.

తీరా యివాళ పొద్దున్న అతను అన్నయ్యకి ఫోన్ చేసి మీ చెల్లెల్ని సాయంత్రం అలా పార్కుకి తీసికెళ్తా నన్న దగ్గర్నుండి మనసు తుళ్ళితుళ్ళి పడుతూనే వుంది. ఆ తుళ్ళింతల మత్తు వదలనంటూనే ఉంది.

ఏం చేస్తాడు సాయంత్రం పార్కులో?

చేతిలో చెయ్యేసి ఆ చేతిని నొక్కుతాడా?

అలా కాక కథలో చదివినట్లు ఏకంగా నడుంచుట్టూ చెయ్యేసి దగ్గరికి లాక్కుంటాడా? నిజంగానే అతనా పన్లన్నీ చేస్తున్నట్లు అనిపించి చప్పున దోసిట్లో మొహం దాచుకొంది మంజుల.

* * *

బోర్లా పడుకొన్న చంద్రి అరిపాదం రంగడి పాదానికి మెత్తగా తగులుతోంది. పువ్వులా ఆ పాదం తగిలినంత మేరా శరీరం మెత్తగా అయిపోయి రంగడి కళ్ళు మత్తుగా చంద్రివైపే చూస్తున్నాయి.

“ఛో మావా! అట్టా చూత్తావేంటి?... నాకు సిగ్గేత్తాది!” వాల్చిన కళ్ళ చివర్లనుండి చూస్తూ అంది రంగి.

“ఎడకు పోవాలో సెప్పే! నీకంత సిగ్గయితే నువ్వేద బోటిస్తే అడికి పోయి దాక్కుంటా! సెప్పు... నీ పైటకొంగు సాటున దాక్కోనా... నీ...”

“ఛీ... యింత సెప్పకు మావా” ఒకచేత్తో అతని నోరుమూసేసి మరో చెయ్యి అతని మెడచుట్టూ పెనవేస్తూ అతని గుండెల్లో మొహం దాచుకొంటూ

అంది చంద్రి.

మల్లెపూల వాన జల్లున కురిపిన ట్లయింది రంగడికి.

గుండెల్లో దాచుకొన్న రంగిమొహాన్ని రెండుచేతుల్తో దోసిట్లోకి తీసుకుని తడి పెదవులవైపు తమకంగా చూశాడు.

చూస్తున్నకొద్దీ అతని గుండెలు ఎగిసెగసి పడుతూనే వున్నాయి.

* * *

చేతిలోని పత్రికను విసురుగా టేబిల్ మీద పడేశాడు మనోహార్.

వాన్సెన్స్! టైము త్వరగా గడవా లని పొద్దున్న మంచి అపుస్తకం తీసుకొని చదువుతుంటే, టైము మరింత మెల్లగా పరిగెడుతోంది తప్ప కాస్తయినా ముందుకు కదలడం లేదు.

అయిదున్నర! యింకా అరగంట టైముంది.

ఇప్పట్నుంచీ మంజుల యింటికి వెళ్ళినా ఫర్వాలేదు వాళ్ళేమీ అనుకోరు. కానీ... అమ్మో! చులకనయిపోదూ?

మనసాగలేక మంజులతో పార్కు ప్రోగ్రాం పెట్టుకొన్నాడేగానీ... తీరా వెళ్ళాక ఏం చెయ్యాలి? చెయ్యిపట్టుకుంటే గుడ్లురిమి చూస్తుందా లేక కథలోని చంద్రిలా ఆ చేతిలో తన మొహం దాచేసుకొంటుందా?

చెయ్యీచెయ్యీ తగలగానే యిద్దరి వొళ్ళూ జల్లుమంటే... చేతులతో ఆగక మరేదైనా చెయ్యమని మనసు తొందర పెడితే?

పార్కులో అందరూ చూసి నవ్వ రూ? నవ్వుతుంటే నవ్వుకోనీ తనకేం? కళ్ళుమూసుకొన్నాడు మనోహార్.

కనురెప్పల వెనకనించి మంజుల మొహం ఫక్కున నవ్వుతూ ముందు కొచ్చింది. మంచంమీద యిక పడుకోలేక గబుక్కున లేచి కూర్చొని అద్దం దగ్గరికి నడిచాడు తయారవడానికి.

* * *

పసుప్పచ్చని ఒంటిమీదికి ఆకుపచ్చని చీర...

మామ్మూలుగా వేసుకొనే దానికంటే కొస్త పొట్టి జాకెట్టు వేసుకోవడం వల్ల నడుందగ్గరా, చేతులదగ్గరా ఎండతగలని ఆ భాగం మరింత పసుపచ్చగా కన పడుతూ నడుంకి చేతులకి బంగారు గొలుసులు చుట్టినట్లుంది. ఎర్రరాయి ముక్కుపుడక మీద నీరెండపడి... ఆ ఎర్రదనం పెదవులదాకా పాకి అక్కడ ఆగిపోతోంది.

చెక్కిలిమీది నొక్కులోని చీకటి చెక్కిలి నొక్కుని మరింత అందంగా చేస్తోంది... యిక ఎక్కువసేపు ఆమె వైపు చూడలేనివాడిలా చూపు పక్కకి తిప్పి సిమెంటు బెంచిమీద తను కూర్చొంటూ 'కూర్చోండి' అన్నాడు మనోహార్

బిడియంగా కొస్త దూరంగా కూర్చొంటూ అతనివైపు చూసీచూడ

నట్లు చూపింది మంజుల.

గోధుమరంగు పాంటులోకి టక్ చేసిన మీగడరంగు చొక్కా...

నడుం వెడల్పుకి రెండింతలు వెడల్పుగా ఛాతి...

పై గుండీ తెరిచివుంచిన చొక్కాలోంచి కనబడుతూ ఉంగరాలు తిరిగిన వెంట్రుకలు, నవ్వుతున్నప్పుడు మూసుకుపోయే చిన్న చిలిపికళ్ళు- అదురుతున్న గుండెను అదుపులో పెట్టుకొంటూ కూర్చొంది మంజుల.

'అలా మైలు దూరంలో కూర్చుంటుందేం?' మనసులోనే చిరాకుపడ్డాడు మనోహర్.

'దగ్గరకు రమ్మనొచ్చుగా? పోనీ నేను రాకపోయినా తనే దగ్గరగా జరగొచ్చుగా!' మనసులోనే బెంగమూతి పెట్టుకొంటూ అనుకొంది మంజుల.

అయిదునిమిషాలు మౌనంగా గడిచిపోయాయి

"పరీక్షలెలా రాశారు?" అడిగాడతను.

'సాయంత్రం చల్లగాల్లో పార్కుకి తీసుకొచ్చి కాబోయే భార్యని మొట్టమొదటిసారిగా అడగవలసిన ప్రశ్న యిదా స్వామీ!' మనసులోనే నుదురు బాదుకొంటూ జవాబిచ్చింది మంజుల.

"బాగానే రాశాను."

మరో అయిదునిమిషాలు నిశబ్దంగా గడిచిపోయాయి. ఆ అయిదు నిమిషాల్లోనూ ఎదురుగా వున్న చెట్టుమీద ఎన్ని పక్షులున్నాయో లెక్కపెట్టాడు మనోహర్. పక్కనున్న పూలమొక్కకి ఎన్ని పూలున్నాయో లెక్కపెట్టేసింది మంజుల

"బియస్సీలో మీ గ్రూపు బీజెడ్‌పి కదూ?" తెలిసిన ప్రశ్నే అయినా మళ్ళీ అడిగాడు, సంభాషణ పొడిగించవలసిన బాధ్యత తనది కాబట్టి.

'వెధవ బీజెడ్పీ తగలడిపోనూ!' అనుకొంటూనే జవాబిచ్చింది మంజుల.

'ఔనండీ' అంటూ.

రెండుప్రశ్నలూ వేసేసి తన బాధ్యత తీరిపోయినట్లు బెంచిఅంచుమీద వున్న ఆమె చేతిగాజులవైపు చూస్తూ కూర్చుండిపోయాడు మనోహర్.

అతని మోచేతులమీద వొత్తుగావున్న వెంట్రుకలకేసి చూస్తూ కూర్చుండిపోయింది మంజుల

'ఆ చేతినలా వెధవ సిమెంటుబెంచీ మీద బిగించేయకపోతే కాస్త నా చేతికేసి జరపొచ్చుగా?' వుక్రోషంగా అనుకొన్నాడు మనోహర్.

'చేతిగాజుల వైపలా గుడ్లుపెట్టుకు చూస్తూ కూర్చుండకపోతే తన చేతిలోకి తీసుకొని ఆ గాజుల్ని సవరించవచ్చుగా?' వుడుక్కొంటూ అనుకొంది మంజుల.

ఆ తర్వాత అప్పుడొకటీ అప్పుడొకటీ ఆమె చదువుగురించీ, పుస్తకాల గురించీ ప్రశ్నలేశాడు మనోహర్. ఆమే

అటువంటివే ప్రశ్న లేసింది.

ఆ ప్రశ్నలూ జవాబుల మధ్య యిద్దరి చూపూ మాత్రం పరిగెడుతున్న వాచీ ముళ్ళమీదే వుంది.

"టైము గడిచిపోతోంది ఏమీ జరగకుండానే' అనుకొంటున్నారిద్దరూ.

పార్కులో చీకటి చిక్కబడుతోంది. ఇంక యింటికెళ్ళిపోయే టైము దగ్గర పడుతోంది. ఆమె గుండె దడదడలాడిపోతోంది. అతని అరచేతుల్లో చెమట పట్టింది.

అతను రెండంగుళాలు ఆమెవైపు జరిగాడు. బెంచీమీదున్న ఆమె చేతిమీద తన చేతిని వేశాడు.

ఆమె చెయ్యికూడా చెమటతో తడిసి చల్లగానే వుంది.

* * *

వస్తూనే హేండ్‌బాగ్‌ని మంచంమీద విసిరికొట్టినట్లు పడేసి కుర్చీలో కూలబడిన ఆడపడుచువైపు వింతగా చూసింది సరస్వతి.

"ఏమోయ్ మరదలా... అంత హుషారుగా మా తమ్ముడుగారితో షికారుకి బయల్దేరి అంత రుసరుసలాడుతూ తిరిగొచ్చేశావేం? ఏమైనా అల్లరిపెట్టాడా?" మరదలి గెడ్డంపట్టుకొని వూపుతూ అడిగింది సరస్వతి.

"నా మొహం!" టేబుల్‌మీద తల వాల్చి అంది మంజుల.

"మరెందుకంత కోపం? కొంపదీసి పెదవులమీద పెదవులద్దాడేమిటి, పార్కువైనా చూడకుండా!"

"నువ్వు మరీనూ... వొదినా!"

"మరెందుకమ్మా ఆ కోపం? నడుం చుట్టూ చెయ్యేసి దగ్గరకు లాక్కున్నాడా?"

"ఛీఛీ!"

"మరేమిటబ్బా!...ఆ...అరచేతిలో ముద్దుపెట్టుకున్నాడా?"

"ఫో! వదినా అదేం లేదు."

"ఏమీ చెయ్యకపోతే అంత కోపమెందుకే తల్లీ!"

"ఏమీ చెయ్యలేదనే కదా యిందాకటి నుంచీ చెపుతోంది! మళ్ళీ కోపమెందుకని అడుగుతావేం?" అంతవరకు బిగబట్టి వుంచుకొన్న వుక్రోషాన్ని ఒక్కుదుటున వెళ్ళగక్కి కుర్చీని విసురుగా వెనక్కి తోసి బాత్‌రూంలోకి నడిచింది మంజుల.

తలుపేసుకొంటున్న మరదలివైపు చూసి నవ్వుకొంది సరస్వతి.

మరో అరగంట తర్వాత ఒదినగారి ఒళ్ళో గారాంగా తలపెట్టుకుని పడుకొంది మంజుల

"అయితే అమ్మాయిగారి కోపం అబ్బాయిగారేదో చేశారని కాక ఏమీ చెయ్యలేదని అన్నమాట?"

"ఫో! వదినా, నీకన్నీ వేళాకోళాలే" బుంగమూతి పెడుతూ అంది మంజుల. ఆ తర్వాత ఆమె గొంతు దిగులుగా మారిపోయింది! 'ఏమిటో ఒదినా, పెళ్ళి

గిల్లి అనుకొంటాం కానీ అందులో థ్రిల్లే ముందీ అని యిప్పుడనిపిస్తోంది. అంత సేపు పార్కులో కూర్చొన్నామా... నా చేతిమీద తనచేతిని కాసేపు వేసుంచి తీసేగాడంతే! ఆ కాసేపూ అతన్లోనూ ఏమీ స్పందన లేదు. నాకూ ఏమీ అనిపించలేదు!"

"......"

"అదికాదొదినా కథల్లో రాస్తుంటారు. శరీరం పులకించడమనీ, ఒళ్ళు జల్లు మనడమనీ, ఎన్నెన్నో రాస్తుంటారుకదా! ఏవేవో చేయాలనిపించడం సంగతలా వుంచి, చేతిమీద చెయ్యేసినా యిద్దరి చేతులూ అలా బిగుసుకుపోయాయేమిటి? పెళ్ళికాక ముందే ఓ థ్రిల్లూ పాడూ లేకపోతే ఇక పెళ్ళయ్యాక ఏముంటుంది? ఏమిటో వొదినా యీ పెళ్ళి చేసుకోక పోతేనేం."

* * *

"సో!... నీ ఫియాన్సీతో నీ మొట్ట మొదటి షికారు చాలా చప్పగా గడిచి పోయిందంటావ్?" మేనల్లుడి పక్కనే నడుస్తూ అన్నాడు శేఖరం.

"అవును మామయ్యా... పెళ్ళంటే జీవితమంతా పువ్వులవాన కురుస్తున్నట్లుండాలి. ఇలా స్తబ్దుగా వున్నట్లు కాదు. ఏమంటావ్" తనకంటే పదేళ్ళు పెద్దయిన శేఖరంతోపాటు నడుస్తూ అన్నాడు మనోహర్.

"అందువల్ల ఈ పెళ్ళే వద్దంటావ్?"

"అదే మంచిదనిపిస్తోంది మామయ్యా- పిల్ల బంగారుబొమ్మలా వుంది. కాదనను. కానీ నా ఖర్మకొద్దీ మా యిద్దరి శరీర తత్వాలూ సరిపోయినట్లు లేదు. జీవిత మంతా నిస్సారంగా గడపడం కంటే పెళ్ళే మానుకొంటే పోలా?" దిగులుగా అన్నాడు మనోహర్.

* * *

ఫక్కున నవ్వింది సరస్వతి.

"నీకన్నీ వేళాకోళంగానే వుంటాయిలే వదినా. పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణ సంకటం అని!" చిరుకోపంగా చూస్తూ వదిన ఒళ్ళోంచి లేవబోయింది మంజుల.

"ఏయ్ మంజూ అలా లేచిపోకు. నాతో అన్నీ చెప్పుకొంటావుగా.... మరి నేను చెప్పింది వినవూ?"

"చెప్పు"

"పొద్దున్నుంచీ పార్కు కెళ్ళడం గురించి అంతగా తహతహలాడుతున్నావ్ కదా- ఆ తహతహలన్నీ దేనికోసం? అతనితో ఏదేదో మాట్లాడుకోవాలనా? అతనేదేదో చేస్తే పులకించి పోవాలనా?"

"........."

"జవాబు చెప్పవేం?" పొద్దున్నుంచీ చూస్తున్నాలే నువ్వా కథని ఎన్నిసార్లు చదివావో!"

"........."

"అబ్బో బుగ్గలలా ఎర్రగా చేసేసుకోనక్కర్లేదులే! నేనూ చదివానా కథ.

అందులో చంద్రీ, రంగడూ ఎన్నాళ్ళ నుంచో ఒకరికొకరు మనసిచ్చి పుచ్చుకొన్నారు. ఎన్నాళ్ళనుంచో ఒకరికోసం ఒకరు తహతహలాడుతున్నారు. ఇంకొకరు ఏమిస్తారోనని కాకుండా ఇంకొకరికి ఏమిద్దామని చూస్తున్నారు. ఇవన్నీ గాక పెళ్ళయిపోవడంతో వాళ్ళిద్దరి మనస్సులూ కూడా స్వేచ్ఛగా వున్నాయి. ఇవన్నీ కలిస్తేనే కదమ్మా ఏ పులకింతయినా పరవశమయినా! ఇవేమీ లేకుండానే వారంరోజులక్రితం ఒకరి పేరొకరూ, ఒకరి చదువొకరూ తెలిసేసుకొని, పెళ్ళి కుదిరిందన్న ఆ ఒక్క విషయమే శరీరాల్ని జల్లుమనిపించాలంటే ఎలా అనిపిస్తుంది?"

* * *

"అంతేనంటావా మామయ్యా?"

"నువ్వే ఆలోచించి చూడు మరి... ప్రేమన్నది గుండెల్లోంచి పుట్టాలి. గుండెల్లోంచి పుట్టిన తడి శరీరాన్నంతా తడపాలి. అప్పుడే ఏ థ్రిల్లయినా... అప్పుడే అందమయిన ఏ అనుభూతయినా! కేవలం స్పర్శలోంచే వచ్చిన అనుభూతి ఎప్పుడూ విస్ఫారంగానే వుంటుంది. ఒకవేళ వుద్రేకం వచ్చినా అదీ తాత్కాలికంగానే వుంటుంది."

"........."

"పార్కులో కెళ్ళి ఏమేం చెయ్యాలని ఆలోచించకుండా ఏమేం మాట్లాడుకోవాలి... ఒకరినొకరు ఎలా అర్థం చేసుకోవాలి— ఒకరి అభిరుచుల్ని ఒకరు ఎలా గౌరవించుకోవాలి— అని ఆలోచించుకొంటూ బయల్దేరితే కొన్నాళ్ళయాక ఆ పులకింతలు వద్దన్నా ఆగవు తెలిసిందా?

* * *

'ఏయ్ మనూ! కిటికీలోంచీ ఆ చవితి చంద్రుణ్ణిలా చూస్తూ నిల్చొంటావేం?'

మల్లెపూల దండలు వేలాడేసిన పందిరి మంచంమీద కూర్చొన్న మంజుల ఆ ప్రశ్నని పైకి వెయ్యకపోయినా ఆమె కళ్ళలో ఆ ప్రశ్నని చదివిన మనోహర్ అన్నాడు చిలిపిగా.

"ఆ చంద్రుడి వొంపు అందంగా వుందా? నా మంజుల నడుం వొంపు అందంగా వుందాని చూస్తున్నా మంజూ!"

"రాత్రంతా పైనున్న ఆ చంద్రుణ్ణి చూస్తూ కూర్చొని కిందున్న ఈ మంజుని మర్చిపోకు— తెల్లారిందంటే..." అతనివైపు ఓరగా చూస్తూ అన్న మంజుల వాక్యాన్ని పూర్తిచెయ్యకుండా దోసిట్లో మొహం దాచుకొంది.

మంచం దగ్గరికి నడిచి ఆమె పక్క కూర్చొన్నాడతను.

మంచంమీద ఆన్చి వుంచిన ఆమె చే దగ్గరికి అతని చెయ్యి కదిలింది. వే చివరి స్పర్శ తగిలీతగ అతి వొంటిమీద మల్లెలవాన జల్లున కురిపించి ఆమె ఒళ్ళు వర్షంలో తడిసిన గువ్వ పిట్టలా కువకువలాడింది!

Printed and Published by A. Chandra Sekar Rao, at 5-9-88 Publi Garden Roa
Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public G
Road, Hyderabad-500 001. Editor A. SUDHAKARA RAO